05ATP27_05ATP27.qxd 27-10-2025 PM 10:52 Page 1



# వైసిపి కదిరి నియోజకవర్గం ఇన్‌చార్జ్‌పై ఫయాజ్ వ్యాఖ్యలు తగవు

- వైకాపా మండల కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి

తనకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

తలుపుల మాజీ కన్వీనర్ ఫయాజ్ కదిరి వైకాపా నియోజకవర్గం ఇన్‌చార్జ్ బిఎస్ మక్బుల్‌పై చేసిన ఆరోపణలు తగవని ఆ పార్టీ మండల కన్వీనర్ మబ్బు అశోక్‌వర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ కన్వీనర్ ఫయాజ్ కదిరి నియోజకవర్గం ఇన్‌చార్జ్ బిఎస్ మక్బుల్‌పై చేసిన వ్యాఖ్యలు పార్టీ గౌరవాన్ని దెబ్బతీస్తాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బిఎస్ మక్బూల్ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఉన్నారని వచ్చే ఎన్నికల్లో కదిరి నియోజకవర్గం నుండి బిఎస్ మక్బూల్‌ను శాసనసభ్యులుగా చూస్తారని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తనకల్లు మండలం ఉపాధ్యక్షులు కొండకమర్ల ముస్తఫా, కొండ మల్లికార్జున, ఎంపిటిసి హిమాదర్‌రెడ్డి, రమణరెడ్డి, ఎంపిటిసి రమణ, మాజీ సర్పంచు శంకర, గౌస్‌పీర్, అగ్రహారం చంద్రమోహనరెడ్డి, చెరుకూరి గంగులప్ప, రెడ్డిపీర, అబ్దుల్ రసూల్, అమీర్, సుబ్రహ్మణ్యం, రమేష్ నాయక్, సూర్యనారాయణ, నరేంద్ర, బిఎస్ నిజాం, లక్ష్మీపతి, గౌస్‌పీర్, తాహిర్, పోరెడ్డి హరినాథ్‌రెడ్డి, అయూబ్, నాగమణి, ఫక్రుదిన్, సదుం గౌస్‌పీర్, రామక్రిష్ణ, రమేష్, రమణరెడ్డి, బాబురెడ్డి, సర్పంచు శ్రీనివాసులు, చంద్ర, ప్రకాష్, సాబ్జాన్, భానుప్రకాష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులకు అన్నదాన కార్యక్రమం

పుట్లూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 106 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, కుమ్మనమల బోనాసి రామకృష్ణ, లక్ష్మీదేవి, బిజెపి శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# మండల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 27 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అండర్-14, అండర్-17 బాలికల విభాగాల్లో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కబడ్డీ పోటీలకు ముఖ్యఅతిథులుగా ఎంఇఒ నాగరాజు, కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున హాజరయ్యారు. ఇందులో భాగంగా అండర్-17 విభాగంలో సాయిచైతన్య విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా కెజివిపి మైనార్టీ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అండర్-14 విభాగంలో సాయిచైతన్య విద్యార్థులు విన్నర్స్ కాగా ప్రసాద్ స్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. గెలుపొందిన జట్లకు వారు బహుమతులు అందచేశారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో సాయిచైతన్య స్కూల్, అకాడమి బాలికలు విజయం సాధించడం పట్ల కోచ్ లక్ష్మీనరసింహ వారిని అభినందించారు.

# మాజీ జెడ్‌పిచైర్మన్ దేశాయి రెడ్డప్ప రెడ్డి మృతి

తనకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్‌పిచైర్మన్ దేశాయి రెడ్డప్ప రెడ్డి సోమవారం మృతి చెందారు. తన స్వగ్రామమైన తనకల్లు మండలం పరాకువాండ్లపల్లిలో ఆయన ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందారు. గతంలో ఆయన ఏడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం జరగనున్నట్లు సమాచారం.

# మట్కా నిర్వాహకులు అరెస్ట్

పెద్దవడుగూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న రషీద్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 15,120 రూపాయల నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా మట్కా పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 9440796826కు సమాచారం ఇవ్వాలన్నారు.

# అమడగూరులో వైసిపికి భారీ షాక్

- 20 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె

అమడగూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

అమడగూరు మండలంలో వైసిపికి భారీ షాక్ తగిలింది. చినగానిపల్లి పంచాయతీ ఆకులవారిపల్లి గ్రామానికి చెందిన వైసిపి కీలక వ్యక్తి మేక హనుమంతరెడ్డి, రామలింగారెడ్డి, గుడ్ల ఆది, ఎన్.రామచంద్ర, చెరువు ముందరపల్లి పొట్టి సుధాకర్‌రెడ్డి, భాస్కర్, చిన్నపానపల్లి రామయ్య, రాజశేఖర్, రామనాథపురం వెంకట్, పతి రామచంద్ర, వడిగిరి శివ, ఏ.కొత్తపల్లి పెద్దిరెడ్డి, జయరామిరెడ్డి, తదితర 20 కుటుంబాలు హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు. సోమవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తామంతా వైసిపిలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నా తమకి ఎలాంటి గుర్తింపులేదని, తమ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్న తీరు, స్థానికంగా ఎమ్మెల్యే సింధూరరెడ్డి పని తీరు ఆమె అసెంబ్లీలో మాట్లాడుతున్న మాట తీరు మాజీ మంత్రి ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి మండలాలను అభివృద్ధి చేస్తారని గట్టి నమ్మకంతో టిడిపిలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమడగూరు మండల టిడిపి కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సాదులవారిపల్లి జయరాం, మండల టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# మంథా తుఫాన్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- తహశీల్దార్ సయ్యద్‌షాబుద్దీన్



తనకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

మంథా తుఫాన్ కారణంగా రాబోవు నాలుగు రోజుల్లో భారీ ఈదురు గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువలన తనకల్లు మండల ప్రజలు జాగ్రత్తగా వుండాలని తహశీల్దార్ సయ్యద్‌షాబుద్దీన్ తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా మట్టి మిద్దె ఇండ్లలో ఎవరు నివాసం చేయరాదన్నారు. వర్ష పరిస్థితి తగ్గే వరకు దగ్గరలో వున్న ప్రభుత్వ భవనాల్లో వుండాలన్నారు. తక్షణమే గ్రామ రెవిన్యూ అధికారికి సమాచారం అందించాలన్నారు. ఈదురుగాలులకు చెట్లు పడి పోవడం, కరెంటు తీగలు జారి పోవడం జరుగుతుందని కావునా చెట్ల క్రింద, కరెంటు స్తంభాల క్రింద ఉండకూడదన్నారు. నీరు వున్న చెరువులు, కాలువల దగ్గరకు పోకూడదన్నారు. ఎలాంటి అసాధారణ పరిస్థితి వున్నా తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9491987580, 9618202073 సమాచారం అందించాలని తహశీల్దార్ తెలియచేశారు.

# మండల స్థాయి గేమ్స్‌లో విజన్ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యాడికి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి డివిజన్ స్థాయి గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఇందులో అండర్-17 కబడ్డీకి చరణ్, గోవర్ధన్, అమృత్, మధు, మణి శ్రీరంగ ఎన్నికవ్వగా అండర్-17 యోగాలో వెంకట్, ఇస్మాయిల్ ఎన్నికవ్వగా, అండర్ -17 ఖోఖోలో రవితేజ, విన్సెంట్ ఎన్నికవగా, అండర్-17 రన్నింగ్‌లో భైరవ, మనోజ్, జ్ఞానచరణ్, అండర్-17 షటిల్‌లో ఫహుదల్లా, జమీల్ ఖదీర్ ఎన్నిక కావడం జరిగింది. అలాగే అండర్-14 కబడ్డీలో విజయ్, ఇర్ఫాన్, గణేష్, మౌర్య, రవి ఎన్నికవ్వగా అండర్-14 సెటిల్‌లో శ్రవణ్, ధనుష్ ఎన్నికవ్వగా అండర్-14 యోగాలో శ్రీకర్ ఎన్నికవ్వడం జరిగింది. దీంతో విజన్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

# ప్రభుత్వ బంజరూ భూమిని పరిరక్షించండి

- జిల్లా కలెక్టర్‌కు వినతి

యాడికి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని వేములపాడు గ్రామం సర్వేనెంబర్ 158లో ఉన్న 9.11 ఎకరాల బంజరు భూమిని పరిరక్షించాలంటూ సోమవారం అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెండేకల్లు గ్రామానికి చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకుడు పుల్లయ్య ఫిర్యాదు చేశారు. వేములపాడు గ్రామం సర్వేనెంబర్ 158లో ఉన్న ప్రభుత్వ బంజరు భూమిని కొందరు అక్రమణ దారులు రిజిస్టర్ చేయించుకున్నట్లు , దాదాపు 2 కోట్లు విలువైన ఈ బంజరు భూమిని కబ్జాదారుల నుండి పరిరక్షించి నిరుపేదలు ఇంటి స్థలాలు లేని వారికి సద్వినియోగం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు పుల్లయ్య ఫిర్యాదు చేశారు. 2013 నుండి ఈ భూమిని పరిరక్షించాలంటూ పుల్లయ్య తమ సంఘం సభ్యులచే ప్రజల చేత పలు పోరాటాలు సాగిస్తున్నట్లు అందుకు సంబంధించిన వివిధ రికార్డులను, అక్రమణదారుల వివరాలను స్థానికంగా సహకరిస్తున్న రెవెన్యూ అధికారుల గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు పుల్లయ్య పేర్కొన్నారు.

# ఈఎస్ఐ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయండి

కదిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కదిరి పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధి (గార్మెంట్స్) పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో జిల్లా స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కదిరి మున్సిపాలిటీలోని వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరార్మణంలో ఉన్న ఏరియా ప్రభుత్వా సుపత్రి భవనాలను వెంటనే పూర్తి చేయాలని, పట్టణంలో 10వేల మందికిపైగా బిడి కార్మికులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, పొగాకు నిరంతరం పని చేయడం వల్ల ఈ వృత్తిలో ఉన్నవారు క్యాన్సర్, క్షయ వ్యాధిన పడుతున్నా రన్నారు. వీరి చికిత్సల నిమిత్తం బయటప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిడి కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ ఇబ్బందులకు అనుగుణంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, వేలాది మంది యువతీ యువకులు బయట ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివ, రామ్మోహన్, బాబ్‌జాన్, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అక్కులప్ప, అనిల్‌లు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ నేపథ్యంలో

# ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలి

- పంచాయతీ కార్యదర్శులకు తెలిపిన ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో



పంచాయతీ కార్యదర్శి తో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

అనంతపురము రూరల్ , అక్టోబర్ 27 ప్రభాతవార్త

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, వాతావరణ శాఖ వారి హెచ్చరికలు, సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతోందని, మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో కురిసే వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహాయ చర్యల కొరకు జిల్లా కేంద్రంలో, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి కలెక్టర్ ఓ.ఆనంద్, పర్యవేక్షించడజరుగుతుందని కావున మన మండలంలో కూడా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో దివాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మొంథా తుఫాను సన్నద్ధతపై ఎంపీడీఓ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. మండలంపై సదరు తుఫాను తీవ్ర ప్రభావం లేనప్పటికీ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనిఅన్నారు.ఈనేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్: 8500292992 కి కాల్,చేసి సహాయం పొందవచ్చన్నారు. వర్షాల వేళ ప్రజలను అత్యంత అప్రమత్తంగా ఉంచాలని, పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదని సూచించారు. ఈసమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, బాబా ఫక్రుద్దీన్, మహమ్మద్ రఫీ, శ్రీధర్, సర్దార్ వలి,మల్లికార్జున, పద్మావతి, హైమావతి, గ్రేట్ 4పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కనిపించని పాలన కూటమి పాలన

-మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న శైలజానాథ్

పుట్లూరు, అక్టోబర్ 27 ప్రభాతవార్త

ప్రజా సంక్షేమం కనిపించని పాలన కూటమి పాలన అని, ప్రజల ఆరోగ్యం, విద్య అనేవి అమ్మకానికి పెట్టే వస్తువులు కావని కోటి సంతకాలతో వైద్య, విద్యను కాపాడుకుందాం అదే మన ధర్మం అని మాజీ మంత్రి, వైసిపి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఓబుళాపురం, దోసలేడు, రామలింగాయపల్లి (చెర్లోపలి) గ్రామాల్లో సోమవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణను వైసిపి శ్రేణులతో కలిసి ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్య నాణ్యతగా అందాలని భావించి 8,480 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని వివరించారు. 2023-24లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలు ప్రారంభించి వాటిల్లో 750 ఎంబిబిఎస్ సీట్లను జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని, పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలను సిద్ధం చేశాక జాతీయ వైద్య మండలి 50 సీట్ల చొప్పున ఇస్తామని చెబితే ఇవ్వొద్దని లేఖ రాసి చంద్రబాబు విద్యార్థులకు అన్యాయం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మిగిలిన పది కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ఇవ్వడం దుర్మార్గమైనదని, తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ద్వారా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం నెలకొల్పిన ప్రజా వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కూటమి కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకోవడం అంటే మన ఆరోగ్య భవిష్యత్తును కాపాడుకోవడమని అందరం కలిసికట్టుగా పోరాడాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రమణయాదవ్, మడుగుపల్లి నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగ కార్యనిర్వాహక సభ్యుడు నొస్సాం నరసింహారెడ్డి, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2.25 కోట్ల వార్షిక వేతనంతో కొలువు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 27 ప్రభాతవార్త



సాత్విక్‌రెడ్డి

తాడిపత్రి పట్టణానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి, అంబిక దంపతుల కుమారుడు సాత్విక్‌రెడ్డి 2.25 కోట్ల వేతనంతో కొలువు సంపాదించి అరుదైన ఘనత సాధించారు. వివరాలు ఇలా వున్నాయి. సాత్విక్‌రెడ్డి న్యూయార్క్‌లోని స్టోన్ బ్రోక్ వర్సిటీలో ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అతడు కాలిఫోర్నియాలోని గూగుల్‌లో 2.25 కోట్లతో కొలువు సంపాదించాడు. దీంతో పట్టణంలోని పలువురు ప్రముఖులు సాత్విక్‌రెడ్డిని ఫోన్‌లో అభినందించారు.

# జిల్లాలో చియా సీడ్ సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ఏ శ్యాంసుందర్



కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కందికుంట, వ్యవసాయ శాఖ అధికారులు

కదిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

జిల్లాలో చియా సీడ్ సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంసుందర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కదిరి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం చియా సీడ్ సాగు విధానం పై ప్రచార కరపత్రాలను కదిరి శాసన సభ్యులు కందికుంట వెంకట ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్, ఆర్డీవో వివిఎస్ శర్మతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చియా సీడ్ సాగు పద్ధతులు, నీటి నిర్వహణ, ఎరువుల వాడకం యాజమాన్య పద్ధతులు తదితరాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా ఈ చియా సీడ్ వాడడం వల్ల ఆరోగ్యానికి కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. బరువు తగ్గడం, గుండె జీర్ణ సంబంధితఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణ, హార్మోన్ల సమతుల్యత వంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సనావుల్లా, వ్యవసాయ శాఖ, డివిజన్ పరిధిలోనీవ్యవసాయ అధికారులు శ్రీహరి నాయక్, షాదాబ్,సుమతి,లక్ష్మీనారాయణ చారిలు సిబ్బంది పాల్గొన్నారు.

# గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి నివేశ స్థలాలు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సిపిఐ జిల్లాకార్యదర్శి

కదిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి వేమాయాదవ్, కార్యకర్తలు

గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న ప్రతి ఒక్కరికీ నివేశ స్థలాలు మంజూరు చేయాలనని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం కదిరి రెవెన్యూ డివిజన్ కార్యాల యంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ మాట్లాడుతూ.. కదిరి మున్సిపల్ పరిధిలోని 83-1, 83-4 సర్వే నెంబర్‌లో 3 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, అనేక సార్లు ధర్నాలు నిర్వహించి దరఖాస్తులు అందజేసినా రెవెన్యూ అధికారులు స్పందించ లేదని ఇంత వరకు సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. అలాగే తలుపుల మ ండలం టి.రెడ్డివారిపల్లిలో సర్వే నెంబర్ 1177, 1173-1, 1179, 1178, 1185 సర్వే నెంబర్లు ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉందని వెంటనే దానిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఓడి చెరువు మండలంలోని ఎనగలూరు గ్రామ పొలంలో సర్వే నెంబర్ 380-2లో, తనకల్లు మండలం బొంతలపల్లి పంచాయితీలో సర్వే నెంబర్ 183-ఎలో గత ఐదు సంవత్సరాలుగా ఇళ్లు కట్టుకుని అక్కడే నివాసం ఉంటున్నారని, పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పవన్, కదిరప్ప, లియాఖతలి, మధు, మనోహర్, హసన్, ఈశ్వరయ్య, శ్రీరాములునాయుడు, రెడ్డప్ప, చలపతి, ఆంజినేయులు పాల్గొన్నారు.

# జిల్లాకు 1822 మెట్రిక్ టన్నుల యూరియా

- ఏడిఏ జిఎం అల్తాఫ్ అలీ ఖాన్.



యూరియా స్టాక్ ను పరిశీలిస్తున్న ఏ డి ఏ జీఎం అల్తాఫ్ అలీ ఖాన్.

అనంతపురం రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త

అనంత జిల్లాకు నర్మదా కంపెనీ కి చెందిన 1822 మెట్రిక్ పనుల యూరియా వచ్చిందని జిల్లాకు వచ్చిన యూరియా స్టాకును సోమవారం పరిశీలించి అందులో మార్క్ ఫెడ్ కు 1220 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు 602 మెట్రిక్ టన్నులు యూరియా రావడం జరిగిందని ఈ యూరియా ను జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరుగుతుందని ఏ డి ఏ జిఎం అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు.

# తడిసిన పంటలకు గిట్టుబాటుధరతో ప్రభుత్వమే కొనుగోలుచేయాలి.

- చిరుతల మల్లికార్జున రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

అనంతపురం రూరల్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

జిల్లావ్యాప్తంగావేరుశనగ,మొక్కజొన్న ఇతరపంటలతోపాటు అనేక రకమైన పంటలనురైతులుసాగుచేయడము జరిగింది. పంటలు దిగుబడి వచ్చే సమయంలో తూఫాన్,వలననష్టపోవడము జరిగి అరకొరగా పండిన పంటలు కోతలు జరుగుతున్నాయనిఅయితే పంటల గిట్టుబాటుధరలు అమాంతం, తగ్గి పోవడంతో దీనివల్ల వేలాది రూపాయలు ఖర్చుచేసిరైతులు పంటసాగు చేస్తే ఇప్పుడు పెట్టుబడికూడాఅందనిపరిస్థితిఏర్పడిందన్నారు. అందుకోసం ప్రభుత్వమే మద్దతు ధరలు మేరకు అన్ని పంటలను కొనుగోలు చేయాలి. ప్రకృతి వైపరీత్యాలవలననష్టపోయినరైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి. పంట విత్తు సమయములో ఉన్న గిట్టుబాటు ధర పంటకోత సమయానికి దళారి వ్యవస్థ వలన ధరలుతగ్గిపోతున్నాయి. అందువలన రైతులు నష్టపోతున్నారు రైతులు దగ్గర పండించిన పంటలను అప్పుగా కొనుగోలు చేసి నగదుఇవ్వకుండా రైతులను మోసముచేస్తున్నారు. వర్షానికి తడిసింది. ధరలను అమాంతంగా రేట్లు తగ్గిస్తున్నారని అందుకోసం క్వింటాల్ మొక్కజొన్నలను రూ. 2,500తో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి మరియు వేరుశనగ రైతులపరిస్థితి కూడా చాలా దుర్భరంగా ఉంది వేరుశనగ 42కిలోల బస్తారూ.3500లతోకొనుగోలు చేయాలి అప్పుడే రైతులకు గిట్టుబాటుధరదక్కుతుంది లేకుంటే సాగుఖర్చులు అధిక, దిక్కుతోచకరైతులు అప్పులపాలైఆత్మహత్యలచేసుకుంటున్నారు ఇప్పటికైనా ప్రభుత్వాలు తక్షణమే స్పందించిపత్తిక్వింటా ధరను 10వేల రూపాయలతో కొనుగోలు చేయాలి రైతులు ఖరీఫ్,లోపండించినపంటలన్నీకి ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, రబిలో పుప్పు శనగ విత్తనాలు ఇంతవరకుఅందించలేదు కనీసము ఇప్పుడు అయినా 90 శాతము సబ్సిడీతో పప్పుశనగఅందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు.

# ఘనంగా కార్తీక సోమవారం వేడుకలు

-భక్తులతో పోటెత్తిన శివాలయాలు






బుగ్గరామలింగేశ్వరున్ని, రాజరాజేశ్వరిదేవిని అలంకరించిన దృశ్యం,ఆలయంలో పూలతో ప్రత్యేక అలంకరణ,స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 27 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాసం మొదటి సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుండే పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారు, అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని పంచముఖ వెండికవచంతో పాటు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామికి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో అర్చకులు పలువురితో శ్రీకేదారనోములను భక్తిశ్రద్ధలతో చేయించారు. ఆలయం మహాద్వారం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ ఇఒ రామాంజినేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, సభ్యులు రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సిఐ ఆరోహనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శివాలయాల్లో కార్తిక మాస పూజలు



రామగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని పలు శివాలయాల్లో కార్తిక మాసం మొదటి సోమవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామగిరి సమీపంలోని వీరన్న గుట్టలోని కోన మల్లేశ్వర ఆలయంలోను, పేరూరులోగల భోగేశ్వరస్వామి ఆలయంలో నసనకోట, కుంటిమద్ది గ్రామాలలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు చేసి ఆకుపూజలు కట్టించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్తిక మాసం కావడంతో మహిళలు దీపాలు వెలిగించారు.

## అడవుల సంరక్షణ మనందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు

రామగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

అడవుల సంరక్షణ మనందరం బాధ్యతగా తీసుకోవాలని అడవులు సంస్థ జీవకోటికి ఆదారమని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం రామగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తిక వన మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మొక్కలు పర్యావరణ పరిరక్షణకు పునాది, జీవవైవిధ్య మనుగడకు అడవులు, వన్య ప్రాణులు ఎంతో కీలకమన్నారు. అడవులు సంరక్షించుకుందాం, కాలుష్యాన్ని నివారిద్దామంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవతా వృక్షాలు నాటడం వల్ల సంస్థ జీవకోటికి మొక్కలు జీవకోటికి ప్రాణవాయువు అందిస్తాయన్నారు. రాగి, ఉసిరి, వేప, మర్రి, జీవిలాంటి మొక్కలు నాటడం వల్ల ఆయుర్వేదానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టూరు ఎఫ్‌బిఓ రత్నమ్మ, కొండపల్లి ఎఫ్‌బిఓ శిరీష, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమంలో హిజ్రాల సేవా కార్యక్రమం

ధర్మవరంటౌన్ అక్టోబర్ 27 ప్రభాతవార్త

ధర్మవరం మండలం గొట్లూరు అనాథ ఆశ్రమం లో హిజ్రాలు సేవా కార్యక్రమం లో పాల్గొన్నారు. తమ సంఘం ప్రెసిడెంట్ రాష్ట్ర నాయకురాలు ఆశీపమ్మ పుట్టినరోజు సందర్భంగా అనాథ ఆశ్రమం లో స్వీట్లు పండ్లు పంచిపెట్టి వంట సరుకులు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమం లో చిట్టి, కావేరి, ఇందు, స్మిత, సుకన్య తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు అమలు పరచాలి

ధర్మవరంటౌన్, అక్టోబరు 27 ప్రభాతవార్త



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీమహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయశ్రీ

రాష్ట్రంలో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయశ్రీ, బీసీ ఉద్యోగులసంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి చిత్తనాగరాజులు తెలిపారు. ఈ సందర్భం గా వారు జయశ్రీ నివాసంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేఖరులసమావేశంలో వారు మాట్లాడారు...ఈనెల 29న తిరుపతిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే ఒక రోజు రిలే నిరాహారదీక్షకు తాము మద్దతు పలుకుతున్నామన్నారు. కావున రాష్ట్రంలోని బీసీలందరు తప్పక హాజరు కావాలన్నారు. ఇదివరకే వైజాగ్ లో మహాసభలతో పాటు దీక్షలు కూడా చేయడం జరిగిందన్నారు. ఈ దీక్షలు.ఉద్యమాలకు నాంది పలుకుతుందన్నారు. 33శాతాన్ని ప్రదానమంత్రి మోదీ ఆమోదించడం జరిగిందని, ఇంతవరకు చట్టంకు నోచుకోలేదన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని వచ్చే ఎన్నికలలో బీసీ సత్తా చూపిస్తామన్నారు.

## ప్రారంభమైన మారికాంబ నూతన వివాహ ప్రతిష్టాపన

అమరాపురం అక్టోబర్ 27 ప్రభాత వార్త



ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు

మండల పరిధిలో వీరాపురం గ్రామం నందు శ్రీ మారికాంబ దేవి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం గ్రామ పెద్దలు ప్రజల సమక్షంలో ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గౌడ రామన్న, గొంచి కార ఈరన్న, గ్రామ పెద్దలు సిద్దప్ప, లక్ష్మన్న, ఉప సర్పంచ్ సిద్దేశ్వర, ఈశ్వరప్ప, సుబ్బరాజు, శ్రీనివాస్, తిప్పే స్వామి, సిద్ధేశ్వర, శివన్న తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు గంగా పూజ కార్యక్రమాన్ని నిర్వహించి దేవాలయ ప్రాంగణంలో విశేష పూజల అనంతరం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి అర్చకులు గణపతి పూజ మరియు హోమాధి కార్యక్రమాలను నిర్వహించారు, నేడు మంగళవారం తెల్లవారుజామునే బ్రాహ్మి ముహూర్తం నందు శ్రీ మారికాంబ దేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన దేవాలయం నందు కొత్తగా మారికాంబ దేవి విగ్రహం ప్రతిష్టాపన చేయనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దేవత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరాపురం గ్రామస్తులు తెలిపారు.

## ఘనంగా కార్తిక సోమవారం శంకరేశ్వరస్వామి పూజలు

అగళి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



స్వామిని అలంకరించిన దృశ్యం

కార్తిక సోమవారం పురస్కరించుకుని శంకరేశ్వరస్వామిని వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. శివకేశవులకు కార్తిక మాసం ఇష్టమైన మాసం మరీ ముఖ్యంగా కార్తిక మాసంలో శివున్ని పూజిస్తే అన్ని మంచి జరుగుతాయని భక్తుల విశ్వాసం. దీపం ఐశ్వర్యానికి నిదర్శనమని, దీపం వెలిగించడం వల్ల చీకటిని పారద్రోలి వెలిగిస్తుంది. అదే మనుషుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని శివపూజ ఈ మాసంలో చాలా పవిత్రమైందని, శివాలయానికి భక్తులు వెళ్లి కార్తిక దీపాలను వెలిగిస్తున్నారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలతో కార్యక్రమం పూర్తి అయింది.

కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు →



## 37 వార్డులకు ఒకే ఒక్కడు

-లోపించిన పారిశుద్ధ్యం -పట్టించుకోని అధికారులు

గుంతకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పట్టణంలోని 37 వార్డులకు ఒకే ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తుండడంతో పారిశుధ్యం పడకేసింది. 4 డివిజన్లకు గాను ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉంది. నెల రోజుల క్రితం ఇద్దరు పనిచేస్తుండగా అనారోగ్య కారణాల రీత్యా ఓ అధికారి సెప్టెంబర్ 30న విఆర్‌ఎస్ తీసుకున్నారు. ఉన్న అధికారి కూడా కార్మికులపై సూపర్‌వైజింగ్ సక్రమంగా లేకపోవడంతో చెత్త, డ్రైనేజీల సమస్య తీవ్రమైంది. అసలే వర్షాకాలం కావడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. చిన్నపాటి వర్షాలకే కాలువలు నిండి మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వీటికి తోడు కార్మికులు, వాహనాల కొరత వేధిస్తోంది. ఉన్న వాహనాలు కూడా ప్రతిసారి రిపేర్లకు వస్తుండడంతో మరమ్మతుల కోసం రోజుల తరబడి షెడ్లకే పరిమితం అవుతున్నాయి. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పట్టణ పారిశుద్ధ్యం తయారయింది. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వివరణ : ఈ విషయంపై అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీదేవిని ప్రభాతవార్త వివరణ కోరగా అధికారులు, కార్మికుల కొరత ఉన్నమాట వాస్తవమన్నారు. నలుగురు సచివాలయ సెక్రటరీలను నియమించి పారిశుద్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

## ఫాగింగ్ ఊసే లేదు... చెత్త సేకరణ అసలే లేదు..!

-అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
-ఎజెండా కాపీలను చించి సమావేశం బహిష్కరణ
-నిర్లక్ష్యం వీడకుంటే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరిక

గుంతకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ దర్గా చెన్నమ్మ

తమ వార్డులో గత 6 నెలలుగా దోమల నివారణకు ఫాగింగ్ ఊసే లేదని, మూడు నెలలుగా చెత్త తొలగింపు అసలే జరగలేదని కౌన్సిలర్ దర్గా చెన్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు కుట్టి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం స్థానిక కౌన్సిల్ సమావేశ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా దర్గా చెన్నమ్మ మాట్లాడుతూ మూడు నెలలుగా చెత్త తీయకపోవడంతో ఒక్కో ఇంటిదగ్గర 3 సంచులు నిండిపోయి ఉందన్నారు. టెండర్లు పూర్తయి రెండేళ్లు గడిచినా తమ వార్డు పరిధిలోని రవీంద్రనాథ్‌ఠాగూర్ స్కూల్ పక్కన కాలువ నిర్మాణం ఇంతవరకు చేపట్టలేదని కౌన్సిలర్ నాగరత్న వాపోయారు. సాధారణ నిధులు ఎలా వాడుకోవాలో కూడా అధికారులకు తెలియడం లేదని కౌన్సిలర్ వై.సుధాకర్ అన్నారు. తన వార్డులో సాధారణ నిధుల కింద మూడుసార్లు పనులు ప్రారంభించి రద్దు చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ప్రారంభించడం ఎందుకు ? రద్దు చేయడం ఎందుకని ప్రశ్నించారు. తాత్కాలికంగా తీసుకున్న 40 మంది పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో కూడా తెలియదని కౌన్సిలర్ కృపాకర్ అన్నారు. కుక్కల బెడదను త్వరగా పరిష్కరించాలని కోరారు. సమస్యలకు కమీషనర్ నయీమ్ అహమ్మద్ సరైన సమాధానాలు చెప్పకపోవడంతో పలువురు కౌన్సిలర్లు ఎజెండా కాపీలను చించి సమావేశాన్ని బహిష్కరించారు. వచ్చే సమావేశంలోగా సమస్యలకు పరిష్కారం చూపకపోతే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కమీషనర్ నయీమ్ అహమ్మద్, అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీదేవి, మేనేజర్ రాధ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, డిఈ లు షబాన, రవిప్రకాష్‌నాయుడు, సుమ, ఆర్ఐ ఎర్రిస్వామి, ఏఈలు హరికృష్ణ, సుదర్శన్, ప్రతాప్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు

గుత్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడల వలన విద్యార్థుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలని సూచించారు. అనంతరం అండర్-14, అండర్-17 విభాగాలలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలతో పాటు చెస్, యోగ, షటిల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు పుష్పరాజ్, శ్యామల, సరోజ, సుప్రీం, ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌కిరణ్, సుంకన్న, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక వసతుల కల్పనకై ధర్నా



మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త

గుత్తి మున్సిపాలిటీలో పలు కాలనీల్లో మౌళిక వసతులు కరువయ్యాయని నిరసిస్తూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ ప్రజల సౌకర్యాలకు అనుగుణంగా ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, మల్లికార్జున, అశోక్‌కుమార్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని ఆత్మహత్య.

రొద్దం. అక్టోబర్ 27 ప్రభాతవార్త.

సుబ్బరాయప్ప గారి కొట్టాల కు చెందిన బోయ రామన్న (75) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది పోలీసులు తెలిపిన వివరాల మేరకు బోయ రామన్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని సోమవారం ఉదయం పూజమ్మ గుడి సమీపంలో చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు విషయం తెలిసిన వెంటనే తెదేపా నాయకులు మాధవ నాయుడు చిన్నప్పయ్య నరహరి వీరాంజనేయులు మృతునికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చడం జరిగింది పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండకు తరలించారు.

## అవెన్యూ ప్లాంటేషన్ నిధులు గోల్ మాల్

పనులు ఒకరివి, బిల్లులు మంజూరు మరొకరికి....?
విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి ....



ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రామాంజనేయులు (ఫైల్ ఫోటో)



ఆధారాలను చూపుతున్న శివకృష్ణ



మొక్కలకు నీళ్లు పడుతున్న రామాంజనేయులు (ఫైల్ ఫోటో)

వజ్రకరూరు అక్టోబర్ 27 ప్రభాతవార్త

ఉపాధి హామీ పథకం కింద మండల కేంద్రంలో 2019 వ సంవత్సరంలో రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కల పెంపకం చేపట్టారు. ఈ పనులను లేట్ రామాంజనేయులు అనే వ్యక్తి వర్క్ ఐడి.. 121690405004170920, మరొక వర్క్ ఐడి.. 12169040504170921 ల క్రింద వజ్రకరూరు ఎంపీడీవో కార్యాలయం నుండి గంజికుంట మఠం, పోలీస్ స్టేషన్ నుండి కమలపాడు బస్టాండ్ పరిసర ప్రాంతం వరకు రోడ్డుకు ఇరువైపులామొక్కల పెంపకం చేపట్టారు. వాటరింగ్ బిల్లులు మంజూరు చేయాలంటూ అప్పటి ఎంపీడీవో రెహానా బేగం పై ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నాకు సైతం దిగారు. బిల్లులమంజూరు విషయంపై ఉన్నతాధికారుల కు కూడా పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సైతం ఎంపీడీవోను మందలించారు. కరోనా సమయంలో కరోనా బారిన పడి కోలుకున్నప్పటికీ ఆరోగ్యం దెబ్బతిని కర్నూలు చికిత్స పొందుతూ రామాంజనేయులు మృతిచెందాడు. 2021 నవంబర్ నెలలో పై వర్క్ ఐడీలకు ఎఫ్టీఓ లను జనరేట్ చేశారు. వాటికి సంబంధించిన బిల్లులు 2022 ఏప్రిల్, 2023 ఫిబ్రవరి నెలలో ఇతర వ్యక్తుల ఖాతాలోరూ. 3.5 లక్షలకు పైగా జమయ్యాయి. ఈ విషయాలన్నింటినీ మృతుడు రామాంజనేయులు కుమారుడు శివకృష్ణ సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించాడు. అనంతరం అధికారులు కలిసి బిల్లుల మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి వారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరాడు. నిధుల గోల్‌మాల్‌పై లోకాయుక్తను ఆశ్రయిస్తా శివ కృష్ణ ఉపాధి హామీ పథకం కింద మా నాన్న లేట్ రామాంజనేయులు చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ పనులకు సంబంధించిన నిధులు మరొకరి ఖాతా కు కొందరు అధికారులు జమా చేశారు. విషయాలన్నీ సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించాను. ఉన్నతాధికారులు విచారణ జరిపి నా కుటుంబానికి న్యాయం చేయకుంటే లోకాయుక్త ను ఆశ్రయిస్తాను.

## కుల బహిష్కరణ విషయంలో కుదిరిన సయోధ్య..?!

-తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, సీఐ బి.మహానంది సమక్షంలో సూత్రప్రాయంగా చేతులు కలిపిన కుల పెద్దలు

ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త



తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, యుపీఎస్ సీఐ బి.మహానంది ఆధ్వర్యంలో జరిగిన సమావేశం



బాధిత కుటుంబంతోపాటు హాజరైన కుల పెద్దలు

ఉరవకొండ పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముండే జోగి వెంకటేష్ కుటుంబం కుల బహిష్కరణ అంశంలో సయోధ్య కుదిరింది. సోమవారం సాయంత్రం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, యుపీఎస్ సీఐ బి.మహానంది జోగి కుల పెద్దలు, బాధితుడు జోగి వెంకటేష్ కుటుంబం, అతని తరుపున పెద్దలతో సమావేశం నిర్వహించగా కుల పెద్దలు బాధితుడితో సూత్రప్రాయంగా చేతులు కలిపారు. వివరాల్లోకి వెళితే..స్థానికంగా కాకుండా ఎంపీఏ వరకు చదువుకున్న తన కొడుకుకు కర్నాటక రాష్ట్రానికి చెందిన చదువుకున్న అమ్మాయితో వివాహం నిశ్చయం చేసుకోవడంపై కుల పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసి తనను కుల బహిష్కరణ చేయడంతోపాటు తన వెంట వచ్చిన నాలుగు కుటుంబాల నుండి 1,200 రూపాయలు చొప్పున తప్పు (అపరాధ రుసుం) కట్టించుకున్నారని తనకు న్యాయం చేయాలని బాధితుడు జోగి వెంకటేష్ ఈనెల 13వ తేదీన జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం అందజేయడం రాష్ట్రంలోనే సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే పోలీసులు కుల పెద్దలపై కేసు సైతం నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనాగరికమైన కుల బహిష్కరణ విషయంలో అధికారులు సరిగ్గా స్పందించలేదని కుల, ప్రజా సంఘాల నుండి ఒత్తిడులు వచ్చిన క్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌భాషా, సీఐ బి.మహానంది బాధితుడు, అతని పక్షం, కుల బహిష్కరణ చేసినట్లు చెప్పబడుతున్న పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. నేటి ఆధునిక సమాజంలో కులాలు, మతాల కుమ్ములాటలు, అనాగరికమైన కట్టుబాట్లకు తావులేదని స్వేచ్ఛగా అందరూ కలిసి మెలిసి జీవించడం అవసరమని నచ్చజెప్పగా మీరు ఎలా చెబితే అలాగే నడుచుకుంటామని కుల పెద్దలు భరోసా ఇచ్చారు. దీంతో పెద్ద మనుషులతో బాధిత జోగి వెంకటేష్‌కు కరచాలనం చేయించి సమావేశాన్ని ముగించారు. కాగా బాధితుడు జోగి వెంకటేష్ మాట్లాడుతూ నోటి మాటలు కాకుండా రాతమూలకంగా తీర్మాణం రాసి సంతకాలు పెట్టించి ఉంటే విలువ ఉండేదని అధికారులను కోరడం విశేషం. ఈ సమావేశంలో సంచార జాతులు, కుల వివక్ష నిర్మూలన, ప్రజా సంఘాల నాయకులతోపాటు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ సత్య సాయి జిల్లాకు నేడు శాసనసభ షెడ్యూల్డ్ కుల సంక్షేమ కమిటీ పర్యటన

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము)అక్టోబర్ 26 ప్రభాతవార్త:

షెడ్యూల్డ్ కులముల సంక్షేమానికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ నేడు శ్రీ సత్య సాయి జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం 3.00 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు, సంఘాల నాయకులు, ప్రతినిధులు మరియు కార్యకర్తలు సమర్పించే వినతిపత్రాలు కమిటీ సభ్యులు స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ సేవలలో రిజర్వేషన్ల అమలు వంటి అంశాలపై సమీక్ష జరపనున్నారు.శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార్ రాజా వర్ల, సభ్యులు కొండ్రు మురళీమోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవి వరప్రసాద్, బోనెల విజయచంద్ర, ఎమ్మెస్ రాజు, రోషన్ కుమార్ సొంగ, విజయ్ కుమార్ బి.ఎన్., శాసనమండలి సభ్యులు కావలి గ్రీష్మ ప్రసాద్, బొమ్మి ఇస్రాయెల్, మురళీధర్ మెరిగ తదితరులు పర్యటనలో పాల్గొననున్నారు.షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు, సంఘాల ప్రతినిధులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు, అభ్యర్థనలు కమిటీకి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఆయా శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరై, పరస్పర సమన్వయంతో పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

## చేనేత మగ్గాలు నీట మునిగి జరిగిన నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వండి

-అధికారులను ఆదేశించిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త



తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉరవకొండ పట్టణంలో చేనేత మగ్గాలు నీట మునిగి జరిగిన నష్టంపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. ఇదివరకే నాలుగు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని అనేక చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు ఉబికి వచ్చి చేనేతలు పని కోల్పోయి నష్టపోయిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆ కాలనీతోపాటు లోతట్టు కాలల్లోని చేనేతల ఇళ్లల్లోకి వర్షపునీరు చేరి ఇళ్లు, మగ్గాలు పూర్తిగా నీటి మునిగాయి. ఈ విషయం మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. ఇంటింటి సర్వే నిర్వహించి జరిగిన నష్టంపై సమగ్ర నివేదికను అందించాలని చేనేత జౌళీ, రెవెన్యూ శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు.

## తుఫాన్ ప్రభావంతో ఉరవకొండలో భారీ వర్షం..!

-గంటన్నరపాటు వర్షం దంచికొట్టడంతో ఇబ్బందులు
-ఇళ్లల్లోకి వర్షంపునీరు, నీట మునిగిన మగ్గాలు

ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త



భారీ వర్షానికి క్లాక్‌టవర్ కూడలిలో నీరు నిలిచిపోయిన దృశ్యం

తుఫాన్ ప్రభావంతో సోమవారం సాయంత్రం ఉరవకొండలో భారీ వర్షం కురిసింది. సాయంత్రం దాదాపు 4 గంటల ప్రాంతంలో మొద లైన 5.30 గంటల వరకు దంచి కొట్టింది. దంతో ప్రధాన రోడ్లపైకి అడుగు, రెండు అడుగుల మేర వర్షపునీరు చేరడం తో పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి అనేకచోట్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. ముఖ్యంగా క్లాక్‌టవర్ కూడలిలో వర్షపునీరు నిలిచిపోవడంతో చిన్నపాటి చెరువును తలపించింది. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు ప్రక్కన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతరత్రా వస్తువులను విక్రయించుకునే చిరు వ్యాపారులు నష్టపోవడంతోపాటు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎస్.కె. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పాత స్టేట్ బ్యాంకు రోడ్డు వైపున కొత్తగా గేటు పెట్టిన ఫలితంగా క్రీడామైదానం గుండా వర్షపునీరు మోతం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వెళ్లే రోడ్డుపైకి రావడంతో నీరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలోకి చేరగా విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఆ రోడ్డు మోత్తం నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇక శివారు కాలనీలు, నూతనంగా ఏర్పడిన జగనన్న కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆయా కాలనీల్లోని మట్టిరోడ్లు వర్షానికి కోతకు గురయ్యాయి. బైపాస్ కె.కె.ఫిలింగ్ స్టేషన్‌వద్ద షరా మామూలే అన్న చందంగా పెద్ద నీటి మడుగు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇందిరా నగర్‌లోని లోతట్టు ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో చేనేత కార్మికులకు చెందిన మగ్గాలు, వాటిపై ఉన్న చీరలు తడిసిపోయి నష్టం ఏర్పడింది. ఈశ్వరమ్మ గుడి వెనుకవైపు ప్రాంతంలో మళ్లీ వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు వచ్చి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## చేనేత కుటుంబానికి 30,500 ఆర్థిక చేయుత

సోమందేపల్లి అక్టోబర్ 27 ప్రభాత వార్త



చేనేత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటవీర క్షత్రియ సంఘం నాయకులు

మండల కేంద్రం లోని సప్తగిరి కాలనీలో చేనేత మగ్గం నేర్చుకొంటూ ఇటీవలే పవర్ లూమ్స్ మేస్త్రి ఇంద్ర భార్యకు 30,500 ఆర్థిక చేయూత అందించిన తొగట వీర క్షత్రియ సంఘంనాయకులు మృతి చెందిన ఇంద్ర కుటుంబా లక్ష్మీదేవికి అండగా ఉంటాం అని భరోసాకల్పించారు ఈ సందర్భంగా తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ చేనేత కులస్తులు అయినటువంటి మేస్త్రి ఇంద్ర(45) మరమగాల రిపేరీలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పక్షవాతం కారణంగా మరణించిన విషయం మనందరికీ తెలిసిన విషయమేనని అతనిసతీమణి లక్ష్మీదేవి అంగవైకల్యం బాధపడు తున్నారు వీరికి ఒక 9 సంవత్సరముల కూతురు కలదు. అకాల మరణం కారణంగా ఆ ఇంటికి మగదిక్కు లేకుండా పోయింది వారి యొక్క కుటుంబ పరిస్థితి బాగాలేదు ఉన్న డబ్బు అంతా హాస్పటల్ ఖర్చులకు అయిపోయిం ది అని తెలిసి సోమవారం ఇంద్ర ఇంటికి వెళ్లి తొగట వీర క్షత్రియ సంఘం సభ్యులు,మేస్త్రి ఇంద్ర భార్య లక్ష్మీదేవిని పరామర్శించి ఆమెకు 30ఖ500 ఆర్థిక సహాయం అంద చేశారు,భయపడకు మీకు మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు,ఈ కార్యక్రమం లో తొగట వీర క్షత్రీయ సంఘం అధ్యక్షుడు,టీడీపీ నాయకుడు దిది హరిదాసు,లింగాలపల్లి సూరి,బండారు శ్రీనివాసులు,పెద్దకోట్ల సోము,గట్టు శ్రీనివాసులు,పూజారి జగదీష్,గట్టు మహేంద్ర,రంగన గోపాల్,దాసరి శ్రీనాథ్,బండి శివ,పూజారి మనోహర్,అమర్నాథ్, గిరి,నేతాజీ, ధన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత కోసమే గ్రామ సభలు డి.ఎస్.పి విజయ్ కుమార్



గ్రామ సభలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ విజయ్ కుమార్

బుక్కపట్నం, అక్టోబర్ 27, ప్రభాతవార్త

మహిళలు,ప్రజల భద్రత ముఖ్య ప్రాధాన్యత గా బావించి గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ తెలియజేశారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి బుక్కపట్నం మండలంలోని రాసింపల్లి గ్రామంలో నేరాల పై ప్రజలకు డిఎస్పి అవగాహన కల్పించారు.మహిళ భద్రత,మాదక ద్రవ్యాలు వలన కలిగే దుష్ప్రభావలు, సైబర్ సేఫ్టీ, రోడ్డు సేఫ్టీ, శక్తి యాప్, డిజిటల్ మోసాలు మహిళలు, బాలికలపై జరిగే నేరాలు , డ్రంక్ అండ్ డ్రైవ్, బాల్య వివాహాలు ,ఫోక్సో కేసుల , గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఈవ్ టీజింగ్ లపై ప్రజలకు వివరించారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లకూడదని తమ పిల్లలను బాగా చదివించుకొని ఉన్నత విద్యావంతులు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా మీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100,112 కు సమాచారం అందించాలని, మీ భద్రతే మాకు ముఖ్యమని డీఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, ఎస్సై కృష్ణమూర్తి, గ్రామస్తులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఎంపిక పోటీలు




పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**రామగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామగిరిలో స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఎంపిక పోటీలు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా రామగిరి మండల విద్యాశాఖ అధికారి వన్ వెంకటేశ్వర ప్రసాద్, ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి పాల్గొని క్రీడల్లో ప్రారంభించారు. ఈ క్రీడల్లో మండలంలోని 9 ఉన్నత పాఠశాల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు వారు తెలిపారు. మంచి ప్రతిభ కనబరిచిన వారిని డివిజనల్ స్థాయికి ఎంపిక చేయడం జరిగినది ఈ పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయులు చిత్ర ఓబులేసు విజయలక్ష్మి అమీన్ సురేష్ వారాది నాగార్జున నరేష్ చంద్రకళ పాల్గొన్నారు. అండర్-14 100 మీటర్స్‌లో మహేందర్ నాయక్ ఫస్ట్ ప్లేస్, చరణ్ సెకండ్ ప్లేస్, అండర్-17 ప్రతి శశిధర్ సెకండ్ ప్లేస్, గర్ల్స్ పావని ఫస్ట్ ప్లేస్, సెకండ్ ప్లేస్, అండర్-17 అలేఖ్య ఫస్ట్ ప్లేస్, వందన సెకండ్ ప్లేస్ కబడిలో కుంటిమద్ది పాఠశాల ఎంజెపి పేరూరు విన్నర్స్ రావడం జరిగింది. సీనియర్ కమిటీలో ఎంజెపి పేరూరు విన్నర్స్ రనర్స్‌గా జడ్పీహెచ్‌ఎస్ కుంటిమద్ది పాఠశాల నిలవడం జరిగినది. హై జంప్ బాలికలు అండర్-14 దీక్షిత ఫస్ట్ ప్లేస్ రామగిరి సెకండ్ ప్లేస్ జడ్పీహెచ్‌ఎస్ పోలేపల్లి అండర్-17 గర్ల్స్ హై జంప్ ఫస్ట్ ప్లేస్ బాయ్స్ లాంగ్ జంప్ అండర్-17 ఎంజెపి పేరూరు ఫస్ట్ ప్లేస్‌లో నిలవడం జరిగినది.

# మెంథో తుఫాన్‌పై అధికారుల సమీక్ష

**రామగిరి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**




అధికారులతో సమీక్షిస్తున్న తహాశీల్దార్, తదితరులు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మ ఏరకు మొంథో తుఫాన్‌పై రాబోవు నాగులు రోజులు ఈదురుగాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం మండల అధికారులు సమీక్ష నిర్వహించారు. తహాశీల్దార్ రవికుమార్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, ఎంపిడిఓ గంగావతి, డాక్టర్ ప్రతాప్‌లు అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. వర్షాలలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. మట్టి మిద్దెలలో, చెట్ల కొంద, కరెంటు తీగల కింద ఉండరాదని తెలియజేయాలన్నారు. అనారోగ్యంతో ఉండాల్సిన కుటుంబ సభ్యుల భద్రత గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తహాశీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌కు అధికారులు సమాచారం అందించాలన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ముత్యాలప్ప

**పరిగి, అక్టోబర్ 27 ( ప్రభాతవార్త):**

మండల పరిధిలోని కోడిగేన హల్లి గ్రామానికి చెందిన ముత్యాలప్ప (50) ఉరివేసుకొని ఆత్మహత్యచేసుకున్న సంఘటన చోటుచేసుకుంది, ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు మృతుడు కొంతకాలంగా ఆనారోగ్య సమస్యలతోనూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితం పై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్ద బాత్రూంలో వైరుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు,మృతిని భార్య గమనించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

# ఉపాధి హామీ పథకం కూలీలు ఈకేవైసి చేయించుకోండి

**గుమ్మఘట్ట అక్టోబర్ 27 ప్రభాతవార్త**



ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసి చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ఉన్నటువంటి ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలు తప్పకుండా ఈకేవైసి చేయించుకోవాలని ఎపిఓ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జాబ్ కార్డ్ లో నమోదు అయిన ప్రతి ఒక్క వేతనదారులు ఆయా గ్రామాల గ్రామపంచాయతీకి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ ను సంప్రదించి జాబ్ కార్డ్ లో ఉన్న వారు ఈ కేవైసీ చేసుకోవాలని, ఈకేవైసి పూర్తి చేసుకున్న వారు మాత్రమే ఉపాధి హామీ పథకం పనిచేయడానికి అవకాశం ఉంటుందని, ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులలో లబ్ధి పొందడానికి వీలుంటుందని లేనిపక్షంలో జాబ్ కార్డు రద్దుచేయడం జరుగుతుందని కావున ఉపాధి హామీ పథకం కూలీలు ఈకేవైసి చేయించుకోవాలని కోరారు.

# కాల భైరవస్వామి ఆలయంలో ఘనంగా కార్తీకమాసం పూజలు

**ధర్మవరంటౌన్, అక్టోబరు 27 ప్రభాతవార్త**



కాలభైరవ స్వామిఆలయంలో దీపోత్సవంవెలిగిస్తున్న మహిళలు

పట్టణంలోని స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. పూజారి ధనుంజయ ఆచారీ భక్తులచే స్వామి వారికి అభిషేకాలు చేయించారు. నారికేల దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆనంతరం అన్నప్రసాద సేవ చేశారు. కార్తీక మాసంలో సోమవారం దీపోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. శివుని అను గ్రహం ఉంటుందని పూజారి తెలిపారు. కాలభైరవ స్వామి ఎదుట దీపాలు వెలిగించడం వల్ల సకల దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

# ధర్మవరంలో అథ్లెటిక్స్ పోటీలు

**ధర్మవరంటౌన్, అక్టోబరు 27 ప్రభాతవార్త**



లాంగ్ జంప్‌లో పాల్గొన్న విద్యార్థి

ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 100,200 800, 1500, 3000 మీటర్ల పరుగుపందెలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్పుట్, డిస్క్, జావెలిన్తో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ స్వరూప, పీడీలు రఘునాథరావు, ఓబుళేశు, రమేశ్ బాబు, నాగేంద్ర, సరళ, సరళ, ప్రైవేటు స్కూల్ పీఈటీలు పాల్గొన్నారు.

# కల్తీ మద్యం నివారణకు ఎక్సైజ్ సురక్ష యాప్ ను ప్రభుత్వం తీసుకొచ్చింది

## ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



సురక్ష యాప్ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం రూరల్ అక్టోబర్ 27 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ప్రభుత్వం కల్తీ మద్యం నివారణ నిమిత్తం ఎక్సైజ్ సురక్ష యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఈ యాప్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు ఆయన నియోజకవర్గం కేంద్రం కళ్యాణదుర్గం. లో సోమవారం ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీరామ్ తో కలిసి కళ్యాణదుర్గం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ చేసి స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని మద్యం షాపులను సందర్శించి షాపుల వద్ద వినియోగదారులు కొనుగోలు చేసే మద్యం నాణ్యమైనదో లేదా నకిలీదో వారే స్వయంగా వారి స్వంత మొబైల్ ఫోన్ నుంచి స్కాన్ చేసి కనుక్కొనే విధంగా ఏర్పాటు చేసిన ఎక్సైజ్ సురక్ష మొబైల్ ఆప్ గురించి అవగాహన కల్పించారు ఎక్సైజ్ సురక్ష మొబైల్ ఆప్ గురించి కరపత్రాలు మద్యం వినియోగ దారులకు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రతి మద్యం సీసాను స్కాన్ చేసి అమ్మాలని మద్యం దుకాణంలో పనిచేసే నౌకర్లను మద్యం దుకాణం యజమానులకు సూచించారు నకిలీ మద్యంపై నిరంతర నిఘాతో కట్టడి చేయాలని కర్ణాటక మద్యం రాకుండా బోర్డర్ మొబైల్ పార్టీ తో కర్ణాటక బోర్డర్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు బెల్ట్ షాపులు నిర్వహించకూడదని ప్రభుత్వ నియమ నిభందనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ కలిగిన మద్యం షాపుల నుంచి బెల్ట్ షాపులకి మద్యం సరఫరా చేస్తే చట్టపరంగా కఠిన తమ తప్పవని, లైసెన్సు రద్దు కు సిఫార్సు చేస్తామన్నారు. అదేవిధంగా జిల్లాలో అన్నీ మద్యం షాప్లు, బార్ల వద్ద ఎక్సైజ్ సురక్ష మొబైల్ ఆప్ గురించి గోడ పత్రికలు ముద్రించి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎక్సైజ్ సిఐ సోమశేఖర్ ఎస్సై శంకర్ నారాయణ, హెడ్ కానిస్టేబుల్ ఇమ్రాన్ కానిస్టేబుళ్లు నరసరాజు ప్రతాప్ లు పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్తకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

## పార్టీలకు అతీతంగా ప్రజాసేవ మా లక్ష్యం

**ధర్మవరంటౌన్, అక్టోబరు 27 ప్రభాతవార్త**



వైసీపీ కార్యకర్తకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీజేపీనేత హరీశ్ బాబు

పార్టీలకు అతీతంగా ప్రజాసేవ మా లక్ష్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. ధర్మవరంకు చెందిన వైసీపీ కార్యకర్త చందమూరునరేంద్ర భార్య చందమూరి హరిత ఇటీవల ఆరోగ్యసమస్యతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమె రూ.1.57 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. దీంతో సోమవారం హరీశ్ బాబు హరిత ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎప్ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆరోగ్యసమస్యలు, జీవన పరిస్థితులు ఎవరిపార్టీని చూసిరావన్నారు. మంత్రి సత్యకుమార్ ప్రజల ఆరోగ్యమే ముఖ్యమన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి సమస్యను ముందుండి పరిష్కరించడమే మా ఎజెండా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుకుంటరాజు, శ్రీనివాసులు, కొంకనాగార్జున, ఆనంద్ పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**గుమ్మఘట్ట అక్టోబర్ 27 ప్రభాతవార్త**



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

గుమ్మఘట్ట మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పాలయ్య మృతి చెందిన విషయం తెలుసుకుని ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంచార్జ్ కాలువ సన్నన్న మృతుని స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి ఐదు వేలు రూపాయలు ఆర్థిక సాయం అందించి, తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కాలవ సన్నన్న, వీరాపురం సర్పంచ్ నాగరాజు, శివకుమార్, బేలోడు సంజీవ, పైదొడ్డి రాజు, రామచంద్ర రెడ్డి, డీలర్ రవి, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కమీషనర్‌కు వినతి

**గుంతకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



కమీషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య లోపంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మురుగు కాలువలు నిండి రోడ్లపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉండడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ఆయన కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటరాఘవ, కార్యదర్శి మునిరాజ్, పట్టణ ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, మహిళా మోర్చా అధ్యక్షురాలు లావణ్య, నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**గుత్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**

గుత్తిపట్టణంలోని కర్నూల్ రోడ్డులో ఉన్న మోడల్ స్కూల్‌లో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిన్నారులు, మహిళల పట్ల వేధింపులు, అఘాయిత్యాలపై రక్షణలో విద్యార్థుల పాత్ర అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు అర్బన్ సిఐ రామారావు బహుమతులు ప్రదానం చేశారు. ప్రజల సంరక్షణ కోసం పోలీసుల విధుల పట్ల అవగాహన కల్పించారు.



విద్యార్థికి బహుమతి అందచేస్తున్న దృశ్యం

# కలశ ప్రతిష్ఠ శోభాయాత్రను విజయవంతం చేయండి

**గుంతకల్లు, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ విజయరాజు

ఈ నెల 29,30, 31తేదీల్లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీనెట్టి కంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ఈఓ మేడేపల్లి విజయరాజు పిలుపునిచ్చారు. సోమవారం దేవాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29న గుంతకల్లు పట్టణ పురవీధుల గుండా సాయంత్రం 4 గంటలకు కలశ ప్రతిష్ఠ శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఘనంగా వన మహోత్సవం

**గుత్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



మొక్కలు నాటుతున్న దృశ్యం

గుత్తి పట్టణంలో సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధుబాబు, హెచ్‌ఎం సుంకన్నల పర్యవేక్షణలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థి స్థాయి నుండి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తద్వారా భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి నారపరెడ్డి, బీట్ అధికారి రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఎం ధర్నా




ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రజల సౌకర్యార్థం మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి, అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ వైద్యంకోసం వచ్చిన వారిని వెంటనే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రత్యేకంగా గర్భవతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి వైద్యశాలలో తగు సౌకర్యాలను కల్పించి పేదలకు వైద్య సేవలు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నిర్మల, మల్లికార్జున, అశోక్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆధార్ అప్ డేట్ చేసుకోండి

**అగళి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్న విద్యార్థులు

అగళి ఉన్నత పాఠశాల తోపాటు ఇనగలూరు ఉన్నత పాఠశాలలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ ఆధార్ కేంద్రాలు కేవలం విద్యార్థుల కోసం ఏర్పాటు చేశామని, ఈ నెల 31వ తేది వరకు ఈ కేంద్రాలు ఆ పాఠశాలల్లో పని చేస్తాయని తెలిపాపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంఇఓ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. పేర్ల తప్పులు అప్‌డేట్, పుట్టిన తేది, తదితర విషయాలను ఆధార్‌లో అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు



మాట్లాడుతున్న అధికారులు, మండల నాయకులు

**బెలుగుప్ప, అక్టోబర్ 27 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి పెద్దన్న మండల పరిషత్ అధికారి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆరు లక్షల ఇళ్లు మంజూరు అయినట్లు వాటిని పేదలకు అందజేస్తామని, ఇది నవంబర్ 5 వరకు సమయం ఉందని, గ్రామాలకు వెళ్లి నవంబర్ 5లోపు గ్రామాల్లో సర్వే చేసి అర్హత ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఒక ఇంటికి 2.52 వేలు మంజూరు అవుతుందని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఇచ్చిన పథకాలు ఒక్కొక్కటి నెరవేరుస్తు వస్తున్నామని అందుకోసం పథకాలన్నీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, ప్రసాద్, రాధకృష్ణ, సునీల్, బి.రాధకృష్ణ, మాజీ వైస్ ఎంపిపి తిమ్మప్ప, మండల నాయకులు, హౌసింగ్ ఏఈ గోపిచంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడి బండయ్య

## -కర్నూల్‌లో జరిగిన సమావేశంలో ప్రమాణ స్వీకారం

**ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త**




సన్మానం పొందిన ఏపీ రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడి బండయ్య (మధ్యలో వ్యక్తి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉరవకొండ పట్టణానికి చెందిన గుడి బండయ్య ఎన్నికయ్యారు. ఈనెల 26వ తేదీన ఆదివారం కర్నూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన సంఘం అధ్యక్షులు జె.వి.మల్లికార్జునస్వామి, వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.రుద్రయ్యస్వామి, కార్యదర్శి మఠం శివకుమార్, కార్యవర్గ సభ్యులు టి.ఎస్.విజయ్‌కుమార్‌లతో కలిసి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గుడి బండయ్య మాట్లాడుతూ తనపై నమ్మకముంచి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ జంగమ కులస్థుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యవర్గ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్తూరు గ్రామంలో ఘనంగా జాతర

## అలంకరించిన ఎద్దుల బండి సవారిలో పాల్గొన్న టిడిపి నేతలు ధర్మతేజ మోరేపల్లి మల్లికార్జున

**కళ్యాణదుర్గం అక్టోబర్ 27 ప్రభాతవార్త**



కొత్తూరు గ్రామంలో జుంజప్ప జాతరలో బండి సవారి

కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామంలో కార్తీకమాసం తొలి సోమవారం నిర్వహించే జుంజప్ప జాతర జోరుగా సాగింది. ఈ సందర్భంగా జింజప్ప జాతరలో ప్రధాన ఆకర్షణగా రైతులు అలంకరించిన ఎద్దుల బండి సవారి నిర్వహించి జుంజప్ప దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా జాతరకు వచ్చిన టిడిపి నాయకులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగానే తెలుగుదేశం పార్టీ యువ నేత ధర్మతేజ, సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు టిడిపి ముఖ్య నాయకులు ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండి సవారిలో పాల్గొని అలరించారు. అనంతరం జుంజప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కంబదూరులో సురక్ష యాప్ పై అవగాహన

**కంబదూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం నాణ్యతను తెలుసుకోవచ్చని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన కంబదూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొని విచారణ పూర్తి చేసి ఛార్జ్ షీట్ తో కోర్టులో హాజరపరచాలని సూచించారు. అనంతరం మద్యం దుకాణం వద్ద ఆయన మాట్లాడుతూ బాటిల్ పై ఉన్న క్యూర్ కోడ్ ద్వారా మద్యం కల్తీదా , నాణ్యమైనదా అని తెలుసుకోవచ్చని చెప్పారు. సురక్ష యాప్ తో నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టవచని తెలియజేశారు. మద్యం దుకాణాలను ఎక్సైజ్ సిబ్బంది క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. మద్యం దుకాణం నిర్వాహకులు యాప్ ద్వారానే విక్రయాలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సునీల్ కుమార్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

## -జిల్లా ఎస్పీకు విన్నవించిన బాధిత మహిళ తనయుడు

**ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త**

రాకెట్ల తండా గ్రామంలో సర్వే నంబర్ 308లోని పట్టా నంబర్ 39లో రుక్మిణీ బాయికు చెందిన స్థలాన్ని నలికీ పత్రాలను అడ్డుపెట్టుకొని దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్‌కు బాధిత మహిళ తనయుడు రామప్పనాయక్ పిర్యాదు చేశారు. జిల్లా కేంద్రం అనంతపురంలో ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఎస్పీకు వాస్తవ పరిస్థితులను వివరించారు. రుక్మిణీబాయికు 1999లో ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందన్నారు. అయితే సదరు స్థలం ఖాళీగా ఉండటంతో దానిపై కన్నేసిన గ్రామానికి చెందిన కొందరు ఇల్లు కట్టుకున్నారన్నారు. స్థలం ఆక్రమణ కోసం అధికార యంత్రాగాన్ని మోసగించి నకిలీ పొజీషన్ సర్టిఫికేట్‌ను సృష్టించారని విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

# రుణాలు ఇవ్వాలని యూనియన్ బ్యాంకు ముందు కౌలు రైతుల ధర్నా

## -మేనేజర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేత

**ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రుణాలు అందించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల యూనియన్ బ్యాంకు ముందు సోమవారం దేవాలయ భూముల కౌలు రైతు సంఘం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు మాట్లాడుతూ సీసీఆర్ కార్డులు కలిగిన కౌలు రైతులందరికీ భూమి యజమాని సంతకం లేకుండా ఆర్‌బీఐ నిబంధనల మేరకు 2 లక్షల రూపాయలు వ్యవసాయ రుణం అందించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది బ్యాంకర్లు వ్యవసాయ రుణాలు ఇస్తామని చెప్పి చివరికి టైం అయిపోయిందని ఇవ్వలేదని ఈ ఏడాదైనా రుణాలు అందించాలన్నారు. బ్యాంకుల్లో రుణాలు అందకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల నుండి తప్పనిసరి పరిస్థితుల్లో అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని కౌలు రైతులు పంటలపైపెట్టుబడి పెడుతున్నారన్నారు. కౌలురైతుల ఇబ్బందులను దృష్టిలోపెట్టుకొని వెంటనే రుణాలుఅందించాలని కోరుతూ ధర్నా అనంతరం మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో దేవాలయ భూముల కౌలు రైతు సంఘం నాయకులు సురేష్, శీనప్ప, రెహమాన్, సుంకన్న, ధనుంజయ, ఓబన్న, నాగప్ప, గంగన్న, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

## -మెరుగుపడిన అధికారుల హాజరు

**ఉరవకొండ, అక్టోబర్ 27 ప్రభాతవార్త**



పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకొంటున్న తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌భాషా

పట్టణంలోని మండల తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు ఐదు అర్జీలు అందాయి. తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని తదితర సమస్యలపై ప్రజలు అధికారులకు అర్జీలు సమర్పించారు. కాగా పీజీఆర్ఎస్ గతానికి భిన్నంగా అధికారుల హాజరు మెరుగుపడటం విశేషంగా చెప్పాలి. మెజార్టీ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరు కావడంతో పీజీఆర్ఎస్ కార్యక్రమం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపీడీవో బి.వి.రవి ప్రసాద్, ఏవో బి.రామకృష్ణుడు, హౌసింగ్ ఏఈ అశ్వర్థనారాయణ, ఉపాధిహామీ ఏపీవో సుజాత, జీబీసీ ఏఈఈ షర్ఫుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, ఆర్అండ్‌బీ ఇతరత్రా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

